క్లుప్తంగా

వైభవంగా ఎల్లమ్మ సంబరం


కవిటి: గజముద్దను ఊరేగిస్తున్న దృశ్యం

కవిటి: కుసుంపురంలో వెలసిన జామి ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి సంబరాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో మంగళవారం జరుపుకున్నారు. అమ్మవారి ప్రతిరూపంగా భావించే గజముద్దను మేళతాళాలతో, బాణసంచా కాలుస్తూ గ్రామవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాద వితరణ చేశారు.
సోంపేట: సోంపేట పట్టణంలో జామి ఎల్లమ్మ యాత్ర మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

నేడు జామిఎల్లమ్మ యాత్ర

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలో జామి ఎల్లమ్మ యాత్ర బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. మున్సిపాలిటీ పరిధి బెల్లుపడ బంద రోడ్డులో ఎల్లమ్మ ఆలయం ఉంది. ఇక్కడ ఏటా నిర్వహించే యాత్రకు స్థానికులతోపాటు సమీప మండలాలు, పక్కనే ఉన్న ఒడిశా రాష్ట్రానికి చెందిన భక్తులు వచ్చి ఎల్లమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. యాత్ర కోసం ఆలయ గర్భగుడి, పుట్ట వద్ద కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

కంచిలి జూనియర్ కళాశాలలో సార్వత్రిక విద్య

కంచిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సార్వత్రిక విద్యాపీఠం కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ కె.అప్పలరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ బోర్డు చొరవతో రాష్ట్ర ప్రభుత్వం దీన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఇంటర్ విద్యను మధ్యలో నిలిపివేసిన, పదో తరగతి ఉత్తీర్ణులై ఇంటర్ చదవని వారికి సార్వత్రిక విద్యాపీఠంలో ప్రవేశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైనవారు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే హాల్ టికెట్లు పొందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రయోగ పరీక్షలకు సిద్ధంగా ఉండి, సకాలంలో హాజరు కావాలన్నారు.

జాతీయస్థాయి డ్రోన్ల పోటీల్లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్య ప్రతినిధులు

టెక్కలి: విశాఖలోని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో గత నెల 24వ తేదీ నుంచి రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయస్థాయి డ్రోన్ల పోటీల్లో టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్లు డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీల్లో 12 కళాశాలలకు చెందిన విద్యార్థులు రూపొందించిన డ్రోన్లను ప్రదర్శించారు. ఇందులో తమ కళాశాల విద్యార్థులు రూపొందించిన 'సెక్యూరిటీ సర్వెలెన్స్' ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు టి.పాండురంగవిఠల్, డి.రఘువీర్, ఆర్.చంద్రమోహన్, వై.రమేష్, డి.శ్రీరాములు, బి.రామారావు, యు.డి.ప్రసన్న అభినందించారు.

కిడ్నీవ్యాధిగ్రస్తురాలికి ఆర్థిక సాయం


వసంతమ్మకు సాయం అందజేస్తున్న సొసైటీ సభ్యులు

వజ్రపుకొత్తూరు: కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమైన దుక్కవానిపేట గ్రామానికి చెందిన బొండాడ వసంతమ్మకు ఉద్దానం హెల్పింగ్ సొసైటీ అండగా నిలిచింది. ఆమె పేదరికాన్ని దృష్టిలో ఉంచుకుని సొసైటీ సభ్యులు మంగళవారం ఆమె ఇంటికి వెళ్లి వైద్య ఖర్చుల కోసం ఎనిమిది వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు. గతంలో ఈమె భర్త కూడా కిడ్నీ వ్యాధితో ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం వసంతమ్మకు రెండు కిడ్నీలు పాడై మంచానికి పరిమితమయ్యారు. దాతలు అండగా నిలవాలని సొసైటీ సభ్యులు కోరారు. కార్యక్రమలో సొసైటీ సభ్యులు సతీష్, చంటి, రవికుమార్, ప్రశాంత్ వెంకటేష్ పాల్గొన్నారు.

వీధిదీపాలకు మరమ్మతులు

టెక్కలి రూరల్: టెక్కలి పాతజాతీయ రహదారిపై ఉన్న వీధి దీపాలు పాడయ్యాయి. దీంతో ప్రధాన జంక్షన్‌లో చీకటితో ప్రజలు ఇబ్బంది పడ్డారు. సిబ్బంది స్పందించి మంగళవారం ఉదయం మరమ్మలు చేపట్టారు. కొత్త దీపాలను ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారమైంది.

ఆలోచనలు అదరహో..

శాస్త్ర, సాంకేతిక రంగంలో భారతదేశ ఖ్యాతిని అంతర్జాతీయస్థాయికి తీసుకెళ్లిన ఘనత భౌతిక శాస్త్రవేత్త సర్ సీవీ రామన్‌కే దక్కిందని వక్తలు కొనియాడారు. ఆయన జయంతిని పురస్కరించుకొని జాతీయ సైన్స్ డేను మంగళవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో రామన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సైన్స్‌తో అభివృద్ధి సాధ్యమని వక్తలు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించి ప్రదర్శించిన వివిధ సైన్స్ ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి. ఉత్తమ ప్రాజెక్టును ఎంపిక చేసి విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.


కవిటి ప్రభుత్వ పాఠశాలలో రామన్‌చిత్రపటానికి పూలమాలలువేస్తున్న హెచ్‌ఎం బి.మల్లేశ్వర రావు


కాశీబుగ్గలోని ఓ కార్పొరేట్ పాఠశాలలో సైన్స్ ప్రాజెక్టులను తిలకిస్తున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు


కవిటి: కొత్తకొజ్జీరియాలో విజ్ఞానశాస్త్ర చిత్రపటాల రంగవల్లికల్లో వేసిన బాలికలు


కోటబొమ్మాళి నిమ్మాడ హైస్కూల్‌లో సైన్స్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎంఈవో గోవిందరావు


వజ్రపుకొత్తూరు రూరల్: నువ్వలరేవు పాఠశాల జీవ వైవిధ్యం ప్రాజెక్ట్‌ను వివరిస్తున్న విద్యార్థులు


కంచిలి: కత్తివరం పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


టెక్కలి: తలగాం ఎట్ నౌపడ ఆర్‌ఎస్ పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శనలు


ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం హైస్కూల్లో విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన


మందస:కుంటికోట కె.నారాయణ హైస్కూల్ విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఈవో లక్ష్మణరావు


ఇచ్ఛాపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ రబీన్‌కుమార్ పాఢీ


కాశీబుగ్గ: చినబడం హైస్కూల్‌లో తిలకిస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు


సోంపేట: సైన్స్ ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న పలాస పురం ఉన్నత పాఠశాల విద్యార్థులు


సంతబొమ్మాళి: దండుగోపాలపురం జెడ్పీ హైస్కూల్‌లో సైన్స్ అక్షర ఆకృతిలో విద్యార్థులు


ఇచ్ఛాపురం: పురుషోత్తపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రదర్శించిన ప్రాజెక్టులు

నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలి

● సమగ్ర శిక్షా ఏపీసీ జయప్రకాష్

వజ్రపుకొత్తూరు: దివంగత రాష్ట్రపతి, మిస్సైల్ మేన్‌గా పేరుగాంచిన డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాంను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని నూతన ఆవిష్కరణలవైపు అడుగులు వేయాలని జిల్లా సమగ్ర శిక్షా ఏపీడీ రోణంకి జయప్రకాష్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఉద్దానం రామక్రిష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో కలాం సేవా సమితి ఆధ్వర్యంలో మండలస్థాయి విజ్ఞానశాస్త్ర ప్రదర్శన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా 42 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రాథమిక స్థాయిలో మడియావానిపేట, మంచినీళ్లపేట, ఉద్దానం రామక్రిష్ణాపురం పాఠశాలలకు చెందిన విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచారు. ప్రాథమికోన్నత పాఠశాలల స్థాయిలో నగరంపల్లి, కొమరల్తాడ పాఠశాలలు, ఉన్నత పాఠశాలల విభాగంలో అమలపాడు, మెట్టూరు పాఠశాలలు విజేతలుగా నిలిచాయి. వీరికి నగదు బహుమతులతో పాటు షీల్డు, ప్రశంసా పత్రాలను ఏపీసీ జయప్రకాష్ అందజేశార. సర్పంచ్ చింత హేమారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమలో ఎంఈవో తులసీరావు, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు లఖినాన కరుణాకర్, హెచ్‌ఎం పి.రమేష్, మాజీ సర్పంచ్ చింత నారాయణ, ఉపాధ్యాయులు డి.అప్పారావు, తులసీరావు, కలాం సేవా సమితి ప్రతినిధులు కార్తీక్, కూర్మారావు, శశి, వెంకటేష్, హేమారావు ఉన్నారు.


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న జయప్రకాష్

సూదికొండలో కార్డన్ సెర్చ్

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి సూదికొండ ప్రాంతంలో కాశీబుగ్గ పోలీసులు మంగళవారం తెల్లవారుజామున కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సీఐ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుమారు 20 మంది పోలీసులు, పలువురు ఎస్సైలు ఇందులో పాల్గొన్నారు. వేకువజామున నాలుగున్నర గంటల సమయంలో అందరి ఇళ్లకు ఒక్కో పోలీసు వెళ్లి తలుపుకొట్టి ఇంటిని పరిశీలించడంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. ప్రతి వీధిలో పోలీసులు ఉండడంతో ఆందోళన చెందారు. అనంతరం కార్డన్ సెర్చ్‌లో భాగంగా తనిఖీలు చేస్తున్నట్టు తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా నగదు, వస్తువులు, సారా, మద్యం, అనుమానిత వ్యక్తుల కోసం ఆరా తీశారు. తనిఖీల్లో కొంతమంది బీహార్ వ్యక్తులు తారసపడడంతో వారి వివరాలు ఆరా తీశారు. అయితే వ్యాపార రీత్యా వచ్చామని చెప్పడంతో వివరాలు నమోదు చేసుకున్నారు.


సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

సీఎం జగన్ పాలనలోనే టైలర్లకు గుర్తింపు


టెక్కలి: టైలర్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న యూనియన్ సభ్యులు


నందిగాం: ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

టెక్కలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న చేదోడు పథకంతో టైలర్లకు ప్రత్యేక గుర్తింపు లభించిందని టెక్కలిలోని కిల్లి పోలమ్మతల్లి టైలర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎం.తవుడు అన్నారు. పట్టణంలో టైలర్స్ డేని మంగళవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుకాణాల్లో టైలర్ వృత్తిని కొనసాగించే వారితో పాటు ఇళ్లల్లో టైలర్ వృత్తిని కొనసాగిస్తున్న వారిని ఆదుకునే విధంగా ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ఈ సందర్భంగా టైలర్స్ పితామహుడు ఇలియాస్ హౌ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఢిల్లేశ్వరరావు, టి.కేశవ, పి.కాశీబాబు, బి.మల్లేశ్వరరావు, హెచ్.శంకర్ రావు, జి.రఘునాథరావు, జి.రవి, కె.అప్పారావు పాల్గొన్నారు.
పలాస: బ్రాహ్మణతర్లా గ్రామంలో ట్రైలర్స్ డేని పురస్కరించుకుని కుట్టుమిషన్‌ను కనుగొన్న విలియం హోవే చిత్ర పటానికి టైలర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టైలరకు చేయూత పథకం కింద ఆర్థిక సహాయం చేస్తుండడంపై హర్షం వ్యక్తం చేశారు.
సోంపేట: బారువ మేజర్ పంచాయతీలోని నూకాలమ్మ టైలరింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకలు జరిగాయి. సీనియర్ టైలర్లను ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు శ్రీనివాసరావు, దాసు, కాళిదాసు, బాలక్రిష్ణ, రమణ పాల్గొన్నారు.
నందిగాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టైలర్లను గుర్తించి వారిని ఆర్థికంగా ఆదుకుంటున్నారని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. నందిగాంలో టైలర్స్ సంఘ అధ్యక్షుడు కొత్తపల్లి మోహనరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టైలర్స్ జెండాను ఎంపీపీ ఎగురవేశారు. అనంతరం దర్జీలతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కురమాన బాలక్రిష్ణారావు, అంబోడి విష్ణు, టైలర్స్ సిద్ధిగోపి, పాత్రో లక్ష్మణ, దుర్యోధన, సాహుకారి కృష్ణారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ఆలోచన విరమించాలి

టెక్కలి: ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేసే ఆలోచలను కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కార్ విరమించుకోవాలని ఏఐవైఎఫ్ సంఘం ప్రతినిధులు కోరారు. టెక్కలిలో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటికే బీఎస్ఎన్ఎల్, రైల్వే, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేయాలనే ఆలచన తగదన్నారు. తక్షణమే ఇటువంటి నిర్ణయాలకు స్వస్తి పలకాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మురళి, శ్రీనివాస్, ఎస్.కృష్ణ, కె.సంతోష్, సందీప్, వసంత్, గణేష్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

ఇచ్ఛాపురం: పట్టణంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్ని పలాస ఆర్డీవో తమరాల సీతారాం మంగళవారం పరిశీలించారు. కేంద్రానికి అవసరమైన అన్ని వసతులను సమకూర్చాలని అధికారులకు సూచించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికలు ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట మండలాల్లోని ఏడు పోలింగ్ కేంద్రాల్లో జరుగుతాయన్నారు. స్థానిక మండల తహసీల్దార్ గురుప్రసాద్ ఉన్నారు.

యువజన సంఘ వార్షికోత్సవం

కవిటి: సమాజాభివృద్ధిలో విద్యదే కీలకపాత్రని శ్రీశయన చైతన్య దీపిక జిల్లా అధ్యక్షుడు దేవాడ మోహనరావు అన్నారు. కాజపురం గ్రామంలోని శ్రీశయన చైతన్య యువజన సంఘం 30వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సంఘ ప్రతినిధులు మరిడి చిన్నప్పన్న, బి.జానకీరావు, పి.నూకరాజు పాల్గొన్నారు.

గణిత అంగుష్టావధాన ప్రక్రియ

కంచిలి: చొట్రాయిపురం ప్రాథమిక పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మడ్డు తిరుపతిరావు సమన్వయకర్తగా విద్యార్థులతో 'గణిత అంగష్టావధానం' ప్రక్రియను మంగళవారం చేపట్టారు. విద్యార్థులు నాలుగో తరగతి విద్యార్థులు కర్రి హారిక, బంగారు భాస్కరరావులచే వినూత్నంగా చేశారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ.. దేశంలో తెలుగు అవధానం, నేత్రావధానం, సంఖ్యావధానం, హాస్యావధానం, గణిత అవధానం , గణిత అంగుష్టావధానం మొదలగు 24 రకాల అవధానాలు ఉన్నాయని పేర్కొన్నారు.

డోలగోవిందపురం విద్యార్థి ప్రతిభ

కంచిలి: డోలగోవిందపురం జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి కె.వాసు గత నెల 26వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులోని ఏఎస్ఆర్ మైదానంలో నిర్వహించిన 18వ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. అండర్–18 విభాగంలో షాట్‌పుట్‌లో మొదటి స్థానాన్ని, జావెలిన్‌త్రోలో తృతీయస్థానాన్ని దక్కించుకొన్నాడు. దీంతో విద్యార్థి వాసును పాఠశాల హెచ్‌ఎం సింహాచలం పండా, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎల్.కె.పండా తదితరులు మంగళవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు.

తిరుపతిలో కళింగ సత్రానికి భూమి కేటాయించాలి

● టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డికి నాయకుల వినతి

టెక్కలి: తిరుమల తిరుపతి దేవస్థానంలో కళింగ సత్రానికి భూమి కేటాయించాలని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, కేంద్రమాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి హాజరైన టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. భూమి కేటాయిస్తే సొంత నిధులతో సత్రాన్ని నిర్మిస్తామని తిలక్ పేర్కొన్నారు. దీనిపై సుబ్బారెడ్డి స్పందిస్తూ దిగువ తిరుపతిలో భూమి కేటాయింపునకు హామీ ఇచ్చినట్లు తిలక్ తెలిపారు. అలాగే నందిగాం మండలం పెంటూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో టీటీడీ ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం నిర్వహించాలని సుబ్బారెడ్డిని కోరామన్నారు.


టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సంక్షిప్తంగా...

పంచాయతీ ఈవో యోగేశ్వరరావుకు అంతిమ వీడ్కోలు
కోటబొమ్మాళి: రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతి చెందిన కోటబొమ్మాళి పంచాయతీ కార్యనిర్వహణాధికారి రఘుపాత్రుని యోగేశ్వరరావు అంత్యక్రియలు అభిమానులు, కుటుంబీకుల సమక్షంలో టెక్కలిలో మంగళవారం పూర్తి చేశారు. అంత్యక్రియల్లో పలువురు అధికారులు, నాయుకులు పాల్గొన్నారు. కోటబొమ్మాళి ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్,"మండల పరిషత్, సచియాలయాల సిబ్బంది, వీఆర్వో అఖిల్,"సర్పంచ్ కాల్ల సంజీవరావు, వైస్ ఎంపీపీ బోయిన నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు కమ్మకట్ల శ్రీనివాసరెడ్డి యోగశ్వరరావు భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

పశువుల అక్రమ రవాణాపై కేసు నమోదు
కోటబొమ్మాళి: కొత్తపేట వద్ద జాతీయ రహదారిపై వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న రెండు ఆవులు, మూడు ఎద్దులను ఎస్సై షేక్ మహమ్మద్ అలి మంగళవారం పట్టుకున్నారు. వీటిని సోంపేట నుంచి విశాఖకు అక్రమంగా తీసుకెళ్తున్నట్టు గుర్తించారు. దీంతో వ్యానుతో పాటు వ్యాపారులను, పశువులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

పేద నాయీబ్రాహ్మణులకు సాయం
వజ్రపుకొత్తూరు: శ్రీకాకుళం పట్టణానికి చెందిన విశ్రాంతి ఉపాధ్యాయ దంపతులు దొంతి కుర్తి త్రినాథరావు, నిర్మలమ్మ నిరుపేద నాయీబ్రాహ్మణులకు ఆర్థికసాయం చేశారు. పూండిలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పలు మండలాలకు చెందిన 20 మందికి.. ఒక్కొక్కరికీ రూ. 3 వేలు చొప్పున సాయం అందించారు.

కిడ్నీ బాధితులకు..
ఇచ్ఛాపురం రూరల్: కేశుపురం గ్రామానికి చెందిన రంగు లోకనాథం, తెలుకల హిరామణి కిడ్నీ వ్యాధితో బాదపడుతున్నారు. స్థానిక కాశీ మాత సేవా సమితి సభ్యులు వీరికి చేరో రూ. ఐదు వేలతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు.

సాదాసీదాగా కౌన్సిల్ సమావేశం
ఇచ్ఛాపురం: మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశాన్ని సాదాసీదాగా ముగించారు. నిర్వహించినట్లు కమీషనర్ ఎన్ రమేష్ పేర్కొన్నారు. రోజువారీ ఆశీల్ల వసూళ్లు, నీటిసరఫరా, మంచినీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టేందుకు సభ్యులు చర్చించి ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్. రమేష్ తెలిపారు. వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతి దివ్య, లాబాల స్వర్ణమణి పాల్గొన్నారు.

నిరాశ్రయుడైన వృద్ధుడికి అండగా..
కంచిలి: మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ నిర్వహిస్తున్న వాన ప్రస్థాశ్రమంలో సోంపేట మండలం బారువ గ్రామానికి చెందిన 80 ఏళ్ల నిరాశ్రయుడైన వృద్ధుడు లక్కోజు రామారావుకు నిర్వాహకులు ఆశ్రయం కల్పించారు. పొట్టకూటి కోసం ఒడిశా వెళ్లిన ఈయన ఇటీవల సోంపేట చేరుకున్నాడు. వృద్ధుడ్ని ఆశ్రమానికి చేర్చే ప్రక్రియలో కానూరు జీవన్, సానా గణేష్, కిమ్మోజి ఢిల్లేశ్వరరావు, సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుళ్ల రమేష్ ఉన్నారు.

న్యాయవాదుల నిరసన
ఇచ్ఛాపురం: న్యాయవాదులపై దాడులు జరగకుండా రక్షణ చట్టం తీసుకురావాలని స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఆవరణలో న్యాయవాదులు మంగళవారం నిరసన తెలియజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు జి.సీతయ్యరెడ్డి, నాగరాజుపాత్రో, ఆర్.దేవరాజు, ఎస్.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.